


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 12 సంచిక : 338 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 8 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :338 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 8 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం..
# ప్రకటించిన సీఎం చంద్రబాబు



- బీసీల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడి
- ఇప్పటికే చట్టం ముసాయిదా సిద్ధమైందని చీరాలలో ప్రకటించిన ముఖ్యమంత్రి
- బీసీ వర్గాల అభ్యున్నతికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు స్పష్టీకరణ
- చేనేత దినోత్సవం సందర్భంగా 'నేతన్న సేవలో' పథకం కింద రూ.179 కోట్లు విడుదల
- ఆర్థిక కష్టాలున్నా అభివృద్ధి, సంక్షేమంలో రాజీ పడబోమని చంద్రబాబు స్పష్టం

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీల) సంక్షేమం, సంరక్షణే ధ్యేయంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇప్పటికే 'బీసీ సంరక్షణ చట్టం' ముసాయిదా సిద్ధమైందని ఆయన వెల్లడించారు. శుక్రవారం బాపట్ల జిల్లా చీరాలలో 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. బీసీలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు వివరించారు. "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుంది. వారి సంక్షేమంతో పాటు, రక్షణ కల్పించేందుకు ఈ చట్టాన్ని రూపొందిస్తున్నాం" అని ఆయన అన్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, వివిధ బీసీ వర్గాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రెండేళ్లలో రూ.505 కోట్లు అందించామని, వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించామని గుర్తుచేశారు. అంతేకాకుండా, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే బీసీలకు 3 కిలోవాట్లకు అదనంగా రూ.20 వేల సబ్సిడీ ఇస్తున్నామని వివరించారు. రాష్ట్ర ప్రజలందరికీ రూ.2.5 లక్షల విలువైన యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు, జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నేతన్న సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని 71,536 అర్హులైన చేనేత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున, మొత్తం రూ.179 కోట్ల ఆర్థిక సాయాన్ని

- మిగతా 2లో



## తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్ష నెరవేర్చిన సీఎం చంద్రబాబు

- సోషల్ మీడియాలో పోస్ట్ చూసి వృద్ధురాలిని పిలిపించుకుని ఫోటో దిగిన సీఎం
- మగ్గంపై తన చిత్రాన్ని నేసిన చేనేత దంపతులను కలిసిన చంద్రబాబు
- శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన నాగేశ్వరరావు, లక్ష్మీలకు అభినందనలు

**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి చంద్రబాబు తన చీరాల పర్యటనలో మానవత్వాన్ని, కళ పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. తనను కలవాలని సోషల్ మీడియాలో కోరిన 90 ఏళ్ల వృద్ధురాలిని ప్రత్యేకంగా పిలిపించుకుని

- మిగతా 2లో




## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?

- డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన
- లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ
- డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్
- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్
- విద్యా దీవెన బకాయిలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:**డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభు త్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు జగన్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ కోరుతూ విజయవాడలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారిపై అధికార పార్టీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు దాడి చేసి, శిబిరాన్ని

- మిగతా 2లో



## పెరిగిన విద్యుత్ డిమాండ్.. 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కొనుగోలుకు ఏపీ కసరత్తు

- ఏపీలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వ చర్యలు
- వేసవిలో 15,000 మెగావాట్లు దాటిన గరిష్ఠ విద్యుత్ వినియోగం
- బేస్‌లోడ్ స్థిరత్వం కోసం థర్మల్ విద్యుత్‌పై ఆధారపడాలని నిర్ణయం

- మిగతా 2లో

## చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నాం.. అందుకు ఈ పథకమే నిదర్శనం

- చీరాలలో 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సాయం
- ఎన్నికల్లో చెప్పని హామీని కూడా నెరవేర్చామన్న ముఖ్యమంత్రి
- చేనేత వర్గాలకు అందిస్తున్న ఉచిత విద్యుత్, పెన్షన్ పథకాలను వివరించిన సీఎం
- చీరాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ

- మిగతా 2లో




### ప్రశాంత్ కిశోర్‌తో డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ భేటీ..
## బీజేపీ సీరియస్ వార్నింగ్!

- ప్రశాంత్ కిశోర్‌తో భేటీ అయిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం సునేత్ర పవార్
- ముంబైలోని ఆమె నివాసంలో గంటలపాటు సాగిన రహస్య చర్చలు
- కూటమిలో చీలికలు తెచ్చే పనులు చేయవద్దని బీజేపీ నేత హెచ్చరిక
- పార్టీ బలోపేతం కోసమే భేటీ అని స్పష్టం చేసిన ఎన్సీపీ వర్గాలు



**పెన్ పవర్ డెస్క్:**మహారాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఎన్సీపీ అధినేత్రి సునేత్ర పవా ర్ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో సమావేశం కావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై అధికార మహా యుతి కూటమిలోని బీజేపీ స్పందించింది. కూటమిలో అనుమానాలకు, విభేదాలకు తావిచ్చే చర్యలకు పాల్పడవద్దని మిత్రపక్షమైన ఎన్సీపీకి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసింది. ముంబైలోని సునేత్ర పవార్ అధికారిక నివాసం 'దేవగిరి'లో గురువారం ఈ భేటీ జరిగింది. ఆమె కుమారుడు,

- మిగతా 2లో



## ఈ నెల 11 లోపు కృష్ణా నీటిని విడుదల చేయకపోతే నార్లాపూర్ ను ముట్టడిస్తాం
### నిరంజన్ రెడ్డి హెచ్చరిక

- నీళ్లు లేవంటూ రైతులను రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారన్న నిరంజన్ రెడ్డి
- ఏపీకి నీళ్లు తరలించేందుకు చంద్రబాబుకు సహకరిస్తున్నారని ఆరోపణ
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పక్కన పెట్టేశారని మండిపాటు

**పెన్ పవర్ డెస్క్:**జూరాల ప్రాజెక్టు పరిధిలోని భీమా ఫేజ్-1, 2, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ లిఫ్టులతో పాటు కేఎల్ఐ కింద ఉన్న పంపులను తక్షణమే ప్రారం భించి పాలమూరు

- మిగతా 2లో

## ఎఫ్‌సీఆర్ఏ బిల్లు మా అంతర్గత విషయం: అమెరికాకు భారత్ గట్టి కౌంటర్

- ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై అమెరికా ఎంపీ వ్యాఖ్యలను ఖండించిన భారత్
- ఇది పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని స్పష్టం చేసిన విదేశాంగ శాఖ
- విదేశీ నిధుల నియంత్రణపై అమెరికాలోనూ చట్టాలున్నాయని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు-2026 (FCRA)పై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు చేసిన విమర్శలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని,

- మిగతా 2లో

# భయపడొద్దు, నేనున్నాను:
## టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

- ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్
- టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని
- "ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా
- పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన

- మిగతా 2లో

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.





## హర్మూజ్ సంక్షోభం వచ్చినా... ఒక్క పెట్రోల్ బంక్ కూడా మూతపడలేదు

- హర్మూజ్ జలసంధి సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా ఎదుర్కొందన్న మంత్రి
- దేశంలో ఎక్కడా ఇంధన కొరత తలెత్తలేదని తెలిపిన కేంద్రమంత్రి పురి
- ముడిచమురు దిగుమతులను 41 దేశాలకు విస్తరించామని వెల్లడి
- భారత్‌కు అతిపెద్ద ఎల్పీజీ సరఫరాదారుగా నిలిచిన అమెరికా

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### లోకేష్ పొగడ్తల వెనుక కథ ఏంటీ

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం అత్యంత ఆసక్తికరమైన అంశం.. మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కురిపిస్తున్న ప్రశంసల వర్షం. మైక్ దొరికినా, డిజిటల్ వేదికలైనా సరే.. అక్కడ స్పేస్ లేకపోయినా సరే.. స్పేస్ సృష్టించుకుని మరీ పవన్‌పై లోకేష్ ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే, ఈ పరిణామంపై తెలుగుదేశం పార్టీకి చెందిన కొంతమంది సోషల్ మీడియా కార్యకర్తల్లో అంతర్గతంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సొంత పార్టీ కార్యకర్తలు తమ ఉనికి కోసం పోరాడుతుంటే, నేత మాత్రం మిత్రపక్ష నాయకుడికి ఈ స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వడం ఏమిటనే చర్చ నడుస్తోందిఈ అసంతృప్తి వెనుక ప్రధానంగా సోషల్ మీడియా పంచాయతీలు అతిపెద్ద కారణంగా కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా డిజిటల్ స్పేస్‌లో టీడీపీ, జనసేన సోషల్ మీడియా సైన్యాల మధ్య నిరంతరం తీవ్రమైన వార్ నడుస్తూనే ఉంటుంది. ఒక పార్టీ పోస్టలకు మరొక పార్టీ కౌంటర్లు ఇస్తూ, క్రెడిట్ వార్ నడుపుతుంటారు. సహజంగానే టీడీపీ సోషల్ మీడియా విభాగానికి ఆద్యుడు, మార్గదర్శకుడు నారా లోకేష్ అనే భావన శ్రేణుల్లో బలంగా ఉంది. తాము సైబర్ యుద్ధం చేస్తుంటే, తమ నాయకుడే పవన్ కల్యాణ్‌ను అభినందిస్తూ పోస్టులు పెట్టడం, ఆయనను అనవసరంగా హైలైట్ చేస్తున్నారని భావించే కొంతమంది సోషల్ మీడియా శ్రేణులు నిరాశకు గురవుతున్నాయి.అయితే, సోషల్ మీడియా విభేదాలకు విరుద్ధంగా నారా లోకేష్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న దాడి, సైబర్ యుద్ధాల వెనుక తన ప్రమేయం లేదని, కూటమి ఐక్యతకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేయడమే లోకేష్ ప్రధాన ఉద్దేశం. పార్టీల మధ్య మైండ్ గేమ్‌లు, శ్రేణుల మధ్య విభేదాలను అణచివేయకపోతే అది ప్రభుత్వ మనుగడకే ప్రమాదకరమని గ్రహించిన లోకేష్, పవన్‌తో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని, గౌరవాన్ని బహిరంగంగా చాటుకోవడం ద్వారా గ్రౌండ్ లెవల్‌లోని సోషల్ మీడియా సైనికులకు ఒక పరోక్ష హెచ్చరిక సగటు సందేశంగా పంపుతున్నారు.రాజకీయాల్లో పొత్తులను సుదీర్ఘకాలం నడపడం, భాగస్వామ్య పక్షాల మధ్య ఎలాంటి మిస్ అండర్‌స్టాండింగ్స్ రాకుండా చూసుకోవడం కత్తిమీద సాము వంటిదే. గత అనుభవాలతో చిన్నపాటి కమ్యూనికేషన్ గ్యాప్ కూడా ప్రత్యర్థి పార్టీ అయిన వైఎస్సార్‌సీపీకి రాజకీయంగా లాభిస్తుందనేది కూటమి పెద్దల వ్యూహం. చంద్రబాబు నాయుడు అరెస్ట్ అయిన సమయంలో పవన్ కల్యాణ్ చూపించిన చొరవ, ధైర్యాన్ని లోకేష్ తరచూ గుర్తుచేసుకుంటూ కృతజ్ఞతా భావాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇది కేవలం రాజకీయ పొగడ్త మాత్రమే కాకుండా, విశ్వసనీయతను కాపాడుకునే ప్రక్రియ. మరో కీలకమైన అంశం ఏమిటంటే, కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ ఇమేజ్ అత్యంత ప్రాధాన్యమైనవి. చంద్రబాబు తర్వాత టీడీపీకి లోకేష్ భావి నాయకుడిగా ఎదిగే క్రమంలో.. జనసేనానితో సత్సంబంధాలు కాపాడుకోవడం భవిష్యత్ రాజకీయ స్థిరత్వానికి చాలా అవసరం. టీడీపీ కార్యకర్తలను, సోషల్ మీడియా యోధులను ఎంతమాత్రం విస్మరించకుండానే, పవన్ కళ్యాణ్ గౌరవానికి ఎక్కడా భంగం వాటిల్లకుండా లోకేష్ అడుగులు వేస్తున్నారు. శ్రేణుల మధ్య పోటీ తత్వం సహజమే అయినా, కూటమి ధర్మాన్ని నిలబెట్టుకోవడమే ప్రాథమిక లక్ష్యమని చాటడం ఇందులో అంతర్లీన వ్యూహం.నారా లోకేష్ అనుసరిస్తున్న ఈ పొగడ్తల వ్యూహం కేవలం వ్యక్తిగత అభిమానం కాక, ఒక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో జరుగుతున్న చిన్నచిన్న పంచాయతీలను పక్కన పెట్టి, కూటమి బంధాన్ని మరింత బలోపేతం చేయడమే ఏపీ ప్రభుత్వ స్థిరత్వానికి మూలస్తంభమని లోకేష్ స్పష్టం చేస్తున్నారు. కార్యకర్తల అసంతృప్తి తాత్కాలికమే అయినా, కూటమి మైత్రి నిలబడితేనే అధికారం సుస్థిరంగా ఉంటుందనే సందేశాన్ని ఆయన డిజిటల్ .రాజకీయ వేదికల ద్వారా సమర్థవంతంగా అందిస్తున్నారని అనుకోవచ్చు.

### తనను కలవాలన్న 90 ఏళ్ల వృద్ధురాలి ఆకాంక్ష నెరవేర్చిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

పలకరిం చడంతో పాటు, మగ్గంపై తన చిత్రాన్ని నేసిన చేనేత దంపతులను అభినందించారు. ఈ రెండు సంఘటనలు ఆయన పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.వివరాల్లోకి వెళితే, చీరాలకు చెందిన 90 ఏళ్ల పుష్పావతి అనే వృద్ధురాలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒక ఫోటో దిగాలన్న తన చిరకాల వాంఛను సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తం చేశారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. తన చీరాల పర్యటనలో తప్పకుండా కలుస్తానని ఎక్స్ వేదికగా హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, పర్యటన సందర్భంగా పుష్పావతిని ప్రత్యేకంగా పిలిపించి ఆప్యాయంగా మాట్లాడారు. ఆమెతో కలిసి ఫోటో దిగి ఆమె కోరికను నెరవేర్చారు. సీఎం తనను గుర్తుపెట్టుకుని పిలిచి మాట్లాడటంతో ఆ వృద్ధురాలు ఆనందంతో అబ్బురపడ్డారు.అదేవిధంగా, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన చేనేత కుటుంబం నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులు కూడా ముఖ్యమంత్రిని కలిశారు. వారు ఎంతో నైపుణ్యంతో మగ్గంపై వస్త్రం రూపంలో చంద్రబాబు చిత్రపటాన్ని నేశారు. వారి కళా ప్రతిభను చూసి ముగ్ధుడైన ముఖ్యమంత్రి, ఆ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. వారి నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ ప్రోత్సాహం అందించారు. సామాన్యుల ఆకాంక్షలకు, కళాకారుల ప్రతిభకు సీఎం ఇస్తున్న విలువకు ఈ సంఘటనలు నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నాం..

రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని, బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం కొత్తపేట గ్రామంలో 'నేతన్న సేవలో' అనే కొత్త పథకాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు రూ. 179 కోట్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకునే ఆగస్టు 7వ తేదీని మరపురాని రోజుగా మార్చాలనే సంకల్పంతో ఈ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా, చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామనడానికి 'నేతన్న సేవలో' పథకమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. చేనేత కేవలం ఒక వృత్తి కాదని, అది భారతీయ సంస్కృతికి, దేశం గర్వించదగ్గ కళకు ప్రతీక అని కొనియాడారు. ఒకప్పుడు చేనేత ఉత్పత్తులతో 'మినీ ముంబై'గా పేరుగాంచిన చీరాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేనేత వర్గాల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తోందని చంద్రబాబు వివరించారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ భరోసా కింద రూ. 4,000 పింఛను అందిస్తున్నామని, దీని ద్వారా 85 వేల మందికి ఏటా రూ. 420 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని, దీనివల్ల 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లు లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రూపంలో రూ. 79 కోట్లు అందించామన్నారు. చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకెళుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ. 10 కోట్లతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం

తెలిపామని, హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమం ద్వారా కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నంలో రూ. 4,200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ద్వారా చేనేత రంగానికి మరింత ఊపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు భయమెందుకు?

- మొదటి పేజి తరువాయి

ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు. పోలీసుల కళ్లెదుటే ఈ దౌర్జన్యం జరిగిందని, టెంట్లు పీకేసి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సహా నిరుద్యోగులపై రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని పేర్కొన్నారు. మహిళలని కూడా చూడకుండా దాడులకు తెగబడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ దాడులు కేవలం విజయవాడకే పరిమితం కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా దీక్షా శిబిరాలపై నిర్బంధకాండ కొనసాగుతోందని జగన్ తెలిపారు. చిలకలూరిపేట, కనిగిరి, యాడికి, తాడిపత్రి, పలమనేరు, రేపల్లె, గుంటూరు, పొన్నూరు, వేమూరు, మాచర్ల, గురజాల, కందుకూరు, బాపట్ల వరకు పలుచోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేసి, నాయకులను నిర్బంధించారని వివరించారు. శాంతియుతంగా ప్రశ్నించే హక్కును కూడా నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని మండిపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని చెబుతున్నప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ఈ సందర్భంగా జగన్ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచారు.

1. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి.
2. ప్రస్తుతం రూ.9,000 కోట్లకు చేరిన విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
3. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున గత రెండేళ్ల బకాయిలతో సహా నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలి.

"చంద్రబాబు గారూ... మీరు దీక్షా శిబిరాలను ధ్వంసం చేయవచ్చు, పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించవచ్చు. కానీ డీఎస్సీ లీకేజీ ఆధారాలను చెరిపేయలేరు. నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరు. న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు" అని జగన్ తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## హర్మూజ్ సంక్షోభం వచ్చినా...
## ఒక్క పెట్రోల్ బంక్ కూడా మూతపడలేదు

హర్మూజ్ జలసంధి వద్ద భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తినప్పటికీ, దేశంలో ఎక్కడా ఇంధన కొరత ఏర్పడకుండా భారత్ సమర్థవంతంగా ఎదుర్కొందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి స్పష్టం చేశారు. ముడిచమురు దిగుమతులకు సంబంధించి ప్రత్యామ్నాయ దేశాలను అన్వేషించడం, దేశీయంగా ఉత్పత్తిని పెంచడంతో పాటు మౌలిక సదుపాయాల విస్తరణ వంటి వ్యూహాత్మక చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆయన వివరించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) వార్షిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.గతంలో భారత్ తన ముడిచమురు అవసరాలతో పాటు, 90 శాతం ఎల్పీజీ, 60 శాతం గ్యాస్ దిగుమతుల కోసం హర్మూజ్ జలసంధిపైనే అధికంగా ఆధారపడేదని మంత్రి గుర్తుచేశారు. సరఫరా వ్యవస్థలో ఆటంకాలు ఏర్పడిన తరుణంలో ప్రభుత్వం సత్వరమే స్పందించిందని ఆయన తెలిపారు. "దేశవ్యాప్తంగా ఉన్న 1,07,000 ఇంధన రిటైల్ అవుట్‌లెట్లలో ఒక్కటి కూడా నిల్వలు లేక మూతపడలేదని నేను గర్వంగా చెప్పగలను" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ముడిచమురు దిగుమతి చేసుకునే దేశాల సంఖ్యను గతంలో ఉన్న 27 నుంచి 41కి పెంచుకున్నామని పురి వెల్లడించారు. అలాగే 2014లో దేశంలో 52,000గా ఉన్న పెట్రోల్ బంకుల సంఖ్య నేడు 1,07,000కు పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం అమెరికా మన దేశానికి అతిపెద్ద ఎల్పీజీ సరఫరాదారుగా అవతరించిందని, మన మొత్తం దిగుమతుల్లో సుమారు 67 శాతం వాటా అక్కడి నుంచే వస్తోందని ఆయన పేర్కొన్నారు.సముద్ర గర్భంలో చమురు, సహజ వాయువు నిక్షేపాల అన్వేషణను ప్రోత్సహించే లక్ష్యంతో రూ.84,000 కోట్ల వ్యయంతో చేపట్టిన 'సముద్ర మంథన్' కార్యక్రమానికి ఇటీవల ఆమోదం తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. ఇక ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఇ20) నాణ్యతపై వస్తున్న ఆందోళనలను ఆయన తోసిపుచ్చారు. అతికొద్ది ప్రాంతాల్లో మాత్రమే స్వల్ప ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో భవిష్యత్తులో తలెత్తే ఎలాంటి భౌగోళిక, రాజకీయ సవాళ్లనైనా భారత్ అధిగమించగలదని హర్దీప్ సింగ్ పురి ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో సురక్షితమైన, స్థిరమైన ప్రపంచ ఇంధన వ్యవస్థ ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

## ఈ నెల 11 లోపు కృష్ణా నీటిని విడుదల చేయకపోతే నార్లాపూర్ ను ముట్టడిస్తాం

- మొదటి పేజి తరువాయి

రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 11వ తేదీలోపు పంపులను ఆన్ చేయకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి భారీ సంఖ్యలో రైతులతో నార్లాపూర్ ప్రాజెక్టును ముట్టడిస్తామని హెచ్చరించారు.

కృష్ణా నదికి ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తున్నప్పటికీ, నీళ్లు లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూనే ఏపీకి నీళ్లు తరలించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు రేవంత్ సహకరిస్తున్నారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తిగా పక్కన పెట్టేశారని విమర్శించిన ఆయన... కర్ణాటక నుంచి వచ్చే వృథా నీటితోనే డిసెంబర్ వరకు జూరాలకు పుష్కలంగా నీరు అందుతుందని, వెంటనే ఎత్తిపోతల పంపులు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

## ఎఫ్‌సీఆర్ఏ బిల్లు మా అంతర్గత విషయం: అమెరికాకు భారత్ గట్టి కౌంటర్

- మొదటి పేజి తరువాయి

దీనిపై ఇతరుల వ్యాఖ్యలు అనవసరమని స్పష్టం చేసింది. విదేశీ నిధుల నియంత్రణకు సంబంధించి అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేసింది.

అమెరికాకు చెందిన రిపబ్లికన్ పార్టీ ప్రతినిధి రైలీ మూర్ ఆగస్టు 4న మాట్లాడుతూ, ఎఫ్‌సీఆర్ఏ బిల్లు క్రైస్తవులపై జరుగుతున్న స్పష్టమైన దాడి అని ఆరోపించారు. ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దయినా లేదా పునరుద్ధరణ జరగకపోయినా.. చర్చిలు, మతపరమైన స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకునే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఈ విమర్శలపై గురువారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. భారత్‌లో చట్టాల రూపకల్పనకు పటిష్ఠమైన

ప్రజాస్వామ్య ప్రక్రియ ఉందని, దేశీయ చట్టాలను సరైన కోణంలో అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు.

విదేశాల నుంచి వచ్చే విరాళాలను నియంత్రించే 2010 నాటి చట్టానికి సవరణలు చేస్తూ ప్రభుత్వం ఈ కొత్త బిల్లును ప్రతిపాదించింది. దీని ప్రకారం, ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దయిన లేదా గడువు ముగిసిన సంస్థల ఆస్తులను, విదేశీ విరాళాలను నిర్వహించడానికి ప్రభుత్వం నియమించిన అధికారికి అధికారాలు లభిస్తాయి. అయితే, ప్రార్థనా స్థలాల మతపరమైన స్వభావాన్ని యథాతథంగా కాపాడతామని ఈ బిల్లులో స్పష్టం చేశారు.

## పెరిగిన విద్యుత్ డిమాండ్.. 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కొనుగోలుకు ఏపీ కసరత్తు

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సుమారు 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను అదనంగా కొనుగోలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు నానాటికీ పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా వేసవి కాలంలో శీతలీకరణ ఉపకరణాల వాడకం అధికం కావడంతో గరిష్ఠ డిమాండ్ 15,000 మెగావాట్లు దాటింది. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలగకుండా ఉండేందుకు ఏపీజెన్‌కో ఆధ్వర్యంలోని థర్మల్ ప్లాంట్లలో ఉత్పత్తిని పెంచడంతో పాటు ఓపెన్ మార్కెట్ నుంచి కూడా విద్యుత్ కొనుగోలు చేస్తున్నారు.ప్రస్తుతం రాష్ట్రానికి ఏపీపీడీసీఎల్ వంటి సంస్థలతో ఉన్న దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా థర్మల్ విద్యుత్ అందుతోంది. అయినప్పటికీ పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా అదనపు కొనుగోళ్లు తప్పనిసరిగా మారాయి. విద్యుత్ కేంద్రాలకు బొగ్గు నిల్వల కొరత లేకుండా చూడటం, సరసమైన ధరలకే విద్యుత్ సేకరించడంపై ఇంధన శాఖ అధికారులు దృష్టి సారించారు.పునరుత్పాదక ఇంధన వనరుల సామర్థ్యాన్ని పెంచుతున్నప్పటికీ, నిరంతరాయ విద్యుత్ సరఫరాలో స్థిరత్వం (బేస్‌లోడ్) కోసం థర్మల్ విద్యుత్‌పై ఆధారపడటం ఎంతో కీలకమని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే అదనపు థర్మల్ విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది.

## భయపడొద్దు, నేనున్నాను:
### టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

- మొదటి పేజి తరువాయి

ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు."ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

## ప్రశాంత్ కిశోర్‌తో డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ భేటీ.. బీజేపీ సీరియస్ వార్నింగ్!

- మొదటి పేజి తరువాయి

ఎన్సీపీ నేత పార్థ్ పవార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. గంటల తరబడి సాగిన ఈ చర్చల్లో పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై మంతనాలు జరిపినట్లు ఎన్సీపీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జనవరిలో తన భర్త, మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత సునేత్ర పవార్, ప్రశాంత్ కిశోర్‌తో భేటీ కావడం ఇది రెండోసారి.ఈ భేటీపై మహారాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ బవాన్‌కులే స్పందించారు. "కూటమిలో చీలికలు తెచ్చే ఎలాంటి చర్యలకు పూనుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ఇది ఎన్సీపీ అంతర్గత వ్యవహారమే అయినప్పటికీ, మహాయుతిలోని భాగస్వామ్య పక్షాలన్నీ కూటమి ధర్మానికి కట్టుబడి ఉండాలని, మిత్రపక్షాలను ఇబ్బంది పెట్టే పనులు చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.ఇటీవల బీహార్‌లోని బంకిపుర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం గమనార్హం. గత మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న బంకిపూర్ నియోజకవర్గంలో ప్రశాంత్ కిశోర్ గెలుపొందిన నేపథ్యంలో, ఈ భేటీకి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపైనే చర్చించినట్లు ఎన్సీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

## బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం.. ప్రకటించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

వారి ఖాతాల్లో జమ చేశారు. చేనేత వృత్తి భారతీయ సంస్కృతికి ప్రతీక అని, చేనేత కళాకారులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీపడటం లేదని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. గత పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నామని, పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అమరావతి నిర్మాణంతో రాష్ట్రానికి 'బ్రాండ్ ఇమేజ్' తీసుకువస్తుంటే, కొందరు 'గొడ్డలి జనరేషన్' కుట్రలతో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటాం : పల్లా



**గాజువాక : పెన్ పవర్, ఆగస్టు 07:** ప్రమాదవశాత్తు మరణించిన 66వ వార్డు అజిమాబాద్ టిడిపి క్రియాశీల కార్యకర్త అబ్దుల్ సుభాన్ సతీమణి కి 5 లక్షల రూపాయల పార్టీ బీమా ఎక్స్గ్రేషన్ శాసనసభ్యుడు, ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అజిమాబాద్ వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ,వార్డ్ టిడిపి అధ్యక్షుడు గోవాడ వాసు, మాజీ కార్పొరేటర్ ఎండి రఫీ ,ప్రధాన కార్యదర్శి ఎండి ముర్తాజ ,గాజువాక నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె రహిమాన్, ప్రధాన కార్యదర్శి బడా బాబు,మసీద్ పెద్దలు మదీనా వలి, ఎండి మోతీ, ఎండి హఫీస్, బాషా ముఖ్య నాయకులు పాల్గొన్నారు .

# పెన్ పవర్
## ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# పాలమే పాఠశాల.. రైతు కష్టమే పాఠం!



* విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు వ్యవసాయంపై అవగాహన
* కుంకంపూడి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని రాజేశ్వరి

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 7:** పాఠశాల అంటే కేవలం నాలుగు గోడల మధ్య పుస్తకాలు చదివే ప్రదేశం మాత్రమే కాదని నిరూపిస్తున్నారు అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం కుంకంపూడి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయిని రాజేశ్వరి. విద్యార్థులకు తరగతి గదిలో పాఠ్యాంశాలను బోధించడంతో పాటు, వాటిని ఆచరణలో చూపిస్తూ "పొలంబడి ప్రాజెక్ట్" ద్వారా వినూత్న విద్యా విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులను నేరుగా పొలాల్లోకి తీసుకెళ్లి వరి నాట్లు వేయించే ప్రక్రియను స్వయంగా పరిచయం చేశారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పొలంలోకి దిగి వరి మొక్కలను చేతబట్టి నాట్లు వేస్తూ రైతు పడే కష్టం, వ్యవసాయ ప్రక్రియ, పంట పండించడంలో ఉన్న శ్రమను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పుస్తకాల్లోని పాఠ్యాంశాలను కేవలం చదివి గుర్తుపెట్టుకోవడం కంటే, ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకున్న విద్య జీవితాంతం గుర్తుంటుందనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టినట్లు ఉపాధ్యాయిని రాజేశ్వరి తెలిపారు. రైతు పొలంలో చెమటోడ్చి పంటను పండిస్తేనే మనకు అన్నం అందుతుందని, వ్యవసాయానికి ప్రకృతి, నీరు, నేలతో ఉన్న అనుబంధాన్ని విద్యార్థులు అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. చిన్న వయసులోనే విద్యార్థులకు రైతు శ్రమ, వ్యవసాయం ప్రాధాన్యత, ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. తరగతి గది నుంచి పొలం వరకు విద్యను తీసుకెళ్లిన ఈ ప్రయత్నం విద్యార్థుల్లో ఆసక్తిని పెంచడంతో పాటు, గ్రామీణ జీవన విధానంపై అవగాహన కల్పిస్తోంది. "పుస్తకాల్లోని పాఠాలతో పాటు బాహ్య ప్రపంచంలోని విశేషాలను విద్యార్థులకు పరిచయం చేయడమే మా లక్ష్యం. పిల్లలు స్వయంగా చేసి నేర్చుకుంటే ఆ జ్ఞానం మరింత బలంగా నిలిచిపోతుంది" అని ఉపాధ్యాయిని రాజేశ్వరి తెలిపారు. విద్యార్థులను "చదువుకునే పిల్లలుగా మాత్రమే కాకుండా.. సమాజాన్ని అర్థం చేసుకునే బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దాలనే" లక్ష్యంతో చేపడుతున్న ఈ వినూత్న కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంటోంది. "పొలమే పాఠశాల.. అనుభవమే విద్య.. రైతు కష్టమే జీవిత పాఠం" అనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెబుతోంది.

# పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

* అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలి: కలెక్టర్ నిశాంతి
* పీజీఆర్ఎస్‌కు 66.. రెవెన్యూ క్లినిక్‌కు 38 అర్జీలు



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 7:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ నిశాంతి.టి అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని, ప్రతి అర్జీని బాధ్యతతో పరిశీలించి పరిష్కారం చూపాలని సూచించారు. పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 66 అర్జీలు, రెవెన్యూ క్లినిక్‌లో 38 అర్జీలు.. మొత్తం 104 వినతులు స్వీకరించారు. కలెక్టర్ నిశాంతి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ, ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, పాడేరు ఆర్డీవో ఎం.భుజంగరావు అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. అత్యవసర ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌కు సంబంధిత జిల్లా అధికారి తన శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనివార్య కారణాలతో హాజరు కాలేని పక్షంలో ముందుగానే అనుమతి తీసుకోవాలని సూచించారు. అర్జీదారుల సమస్యలను సంబంధిత శాఖ అధికారి స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, అర్జీల నమోదు కౌంటర్ వద్ద కింది స్థాయి సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు మండల స్థాయి అధికారులు కూడా తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. విధులకు గైర్హాజరైతే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ సచివాలయాల పరిధిలో గ్రామస్థాయి పీజీఆర్ఎస్ నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని కలెక్టర్ సూచించారు. సాధ్యమైనంత వరకు సమస్యలను స్థానిక స్థాయిలోనే పరిష్కరించడం ద్వారా జిల్లా స్థాయికి వచ్చే అర్జీల సంఖ్య తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర మండల స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను తెలుసుకునేందుకు 'మీకోసం' 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీలను నమోదు చేసుకునేందుకు మీకోసం ఏపీ వెబ్‌సైట్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తోందని,ఐవిఆర్ఎస్ ద్వారా అర్జీదారుల అభిప్రాయాలను సేకరిస్తోందని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డు కార్యాలయాల పరిధిని గుర్తించి అక్కడి ప్రజలతో అధికారులు మాట్లాడి సమస్యల మూల కారణాలను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. అర్జీదారులతో అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఏదైనా సమస్యను పరిష్కరించే అవకాశం లేకుంటే అందుకు గల కారణాలను స్పష్టంగా వివరించాలని ఆదేశించారు. భూ సంబంధిత ఫిర్యాదులను ప్రత్యేకంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. భూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, ప్రభుత్వ రికార్డుల్లోని వివరాలతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయి అధికారులు కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. శుక్రవారం స్వీకరించిన అర్జీల్లో రెవెన్యూ శాఖకు 38, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు 14, విద్యాశాఖకు 8 చొప్పున అత్యధికంగా వినతులు అందాయి. గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, ఎస్ఎంఐ, ఆర్ఓఎఫ్ఆర్, పెన్షన్లు, రోడ్లు--భవనాలు, వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రజలు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీబీకే పరిమళ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి పి.బాబు, జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాల మురళీకృష్ణ, స్వర్ణ గ్రామ--వార్డు కార్యాలయాల నోడల్ అధికారి పి.ఎస్.కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్, జిల్లా సర్వే--భూ రికార్డుల అధికారి ఈశ్వర దొర, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, జిల్లా స్త్రీ--శిశు సంక్షేమ శాఖ అధికారి ఝాన్సీ రామ్ పడాల్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వి.రమణారావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, జిల్లా మలేరియా అధికారి తులసి, మండల రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మిషన్ ఏఎస్ఆర్‌లో 'వారపు ఉత్తమ అధికారి'గా పి.ఎస్. కుమార్

**డీఎల్‌పీఓ సేవలకు జిల్లా కలెక్టర్ నిశాంతి ప్రశంసలు**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 7:** అల్లూరి సీతారామరాజు జిల్లా పరిపాలనలో ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులను గుర్తించి ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) పి.ఎస్. కుమార్ను 'మిషన్ ఏఎస్ఆర్--వారపు ఉత్తమ అధికారి'గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంతి.టి, ఐఏఎస్ చేతుల మీదుగా ఆయనకు ప్రశంసా పత్రం, దుశ్శాలువా, జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై సత్వరమే స్పందించడం, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో పాటు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు పి.ఎస్. కుమార్‌కు ఈ గుర్తింపు లభించింది. పాడేరు డివిజన్ పరిధిలో క్షేత్రస్థాయి తనిఖీలు, అధికారులతో సమీక్షలు, ఫాలోఅప్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. అలాగే అప్పగించిన బాధ్యతలను సమయపాలనతో, సమర్థవంతంగా నిర్వర్తించినందుకు జిల్లా యంత్రాంగం ఆయన సేవలను అభినందించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ.. 'మిషన్ ఏఎస్ఆర్' విజయవంతం కావడంలో అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం ఎంతో కీలకమని అన్నారు. ప్రతి శాఖలో విధుల నిర్వహణలో ఉత్తమ ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. సమస్యలను సవాళ్లుగా స్వీకరించి, వాటిని అవకాశాలుగా మలుచుకుంటూ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'ఒక బృందం--ఒక లక్ష్యం--ఒక ఏఎస్ఆర్' అనే నినాదంతో జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన, మెరుగైన సేవలు అందించడమే జిల్లా పరిపాలన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐఏఎస్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, ఐఏఎస్, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, ఆర్డీవో భుజంగరావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కుమడలో ప్రత్యేక దంత వైద్య శిబిరం ఏర్పాటు




* 101 మందికి దంత సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి చికిత్స.
* రూడకోట పిహెచ్సి వైద్యాధికారి సత్యరావు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 07.** ముంచంగిపుట్టు మండలంలోని కుమడ విలేజ్ క్లినిక్ సెంటర్ లో రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సత్యారావు ఆధ్వర్యంలో ఎయిమ్స్ సౌజన్యంతో ప్రత్యేక దంత వైద్య శిబిరం ఏర్పాటు చేసి 101 మంది దంత సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక దంత వైద్య శిబిరంలో ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ధరణి దంత సమస్యలతో బాధపడుతున్న వారికి దంత పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. వైద్య సేవలు పొందుటకు వచ్చిన రోగులకు దంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ కన్సల్టెంట్ నీలా శాంతి వైద్య అధికారి పర్వీన్, హెచ్వి భాగ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా పోలీసు కమిషనరేట్‌లో ఘన నివాళులు

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 7:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ వేడుకగా ప్రకటించిన శ్రీ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి సందర్భంగా విశాఖ నగర పోలీసు కమిషనరేట్‌లో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్., శ్రీ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ, శ్రీ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ వెనుకబడిన వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక అభ్యున్నతికి విశేష కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, విద్యావేత్త, సామాజిక చైతన్యవేత్త అని కొనియాడారు. ఆయుర్వేద వైద్య రంగంలోనూ విశిష్ట సేవలు అందించడంతో పాటు, అగ్నికుల క్షత్రియ జాతిపితగా సమాజానికి ఎనలేని సేవలు చేశారని పేర్కొన్నారు.

సమాజంలో సమానత్వం, విద్యా ప్రాధాన్యత, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పోలీసు కమిషనర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నగర పోలీసు కమిషనరేట్‌కు చెందిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని శ్రీ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మకు ఘనంగా నివాళులర్పించారు.





## టీబీ ముక్త భారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం



**కూర్మాన పాలెం :పెన్ పవర్, ఆగస్టు07:**జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడి గ్రామం శ్రీ సీత రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్ లో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది స్థానిక ప్రజలు కి ఎక్స్ రే ఉచితంగా తీసి పరీక్షలు చేశారు.

ఈ సందర్భంగా వక్తలు పాల్గొని టీబీ వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలు, చికిత్స విధానం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

టీబీ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పరీక్షలు, చికిత్స సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు సూచించారు. టీబీ రహిత భారత్ సాధనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బోండా ఎల్లజీ, ఐటీడీపి అధ్యక్షులు గోకాడ భాస్కర్, తెలుగు యువత ప్రెసిడెంట్ కర్రి కృష్ణ,వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు మాటూరి రాము,జనసేన నాయకులు కర్రి నూకరాజు,కోరుకొండ శ్రీధర్, గ్రామ పెద్దలు ఈర్ల శ్రీరాములు, కర్ణం వెంకటరావు, ఇందల సురేష్,గోంతిన గోవింద్, కర్రి వాసు, కనకరాజు,రమ,సిబ్బంది దేవుడమ్మా, లక్ష్మి గ్రామ ప్రజలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 66 వార్డ్ లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం



**గాజు వాక : పెన్ పవర్, ఆగస్టు07:**జీవీఎంసీ 66 వార్డులో కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం 45 రోజులు విజయవంతం చేయాలని ప్రజల వద్దకే తెలుగుదేశం పార్టీని పంపిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుని పార్టీ దృష్టికి తీసుకురావాలని ఉద్దేశంతో ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం లో ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు , శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ బూత్ నెంబర్ 211 అజిమాబాదులో బూత్ కన్వీనర్ అన్సర్ వలి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని వారికి కూటమి ప్రభుత్వం తరపున భరోసా ఇస్తూ శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి తో ఈ ప్రభుత్వం ప్రజల పక్షాన ప్రజలకు సంక్షేమం అభివృద్ధి అందిస్తూ ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ గాని తల్లికి వందనం గాని దీపం 2 పథకం ఆటో డ్రైవర్ల సేవలో గాని అన్నదాత సుఖీభవ అన్నా క్యాంటీన్లు పేదలకు ఇల్లు ఎన్టీఆర్ వైద్య సేవలు మత్స్యకార సేవలో కూటమి ప్రభుత్వం సంక్షేమ అందిస్తుందని గాజువాక నియోజవర్గంలో గతంలో 301 జీవో పట్టా గాని ఇప్పుడు25 జీవో ద్వారా హౌస్ కమిటీ పట్టాలు కూడా ఇవ్వడం జరుగుతుందని శాసనసభ్యుడు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరపాల శాఖ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ ,66వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్లు మహమ్మద్ రఫీ , బోండా జగన్నాథ్ , 66వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోమాడ వాసు, కార్యదర్శి ఎండి ముర్తజ, మైనార్టీ సెల్ నాయకులు రెహమాన్ , వల్లి ,మదీనా మున్వర్, నన్న, టీ బ్రహ్మానందం, జహంగీర్, అజీమ్ ,ఇమాన్ ,షబ్బీర్ ఆఫీస్ స్థానిక ముస్లిం పెద్దలు మదీనావళి మోతి జావేద్ మరియు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవజాత శిశువుల మేధో వికాసానికి తల్లిపాలు దివ్య ఔషధం.

- చింతపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాల ముగింపు.
- ఆకట్టుకున్న అంగన్‌వాడీల ర్యాలీ, మానవహారం



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 7.**నవజాత శిశువుల మేధో వికాసానికి, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు తల్లిపాలే అసలైన ఔషధమని చింతపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ సి.హెచ్. శ్రీదేవి ఉద్ఘాటించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని శుక్రవారం చింతపల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు స్థాయి అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ... ఈ ఏడాది థీమ్ అయిన 'పిల్లల యొక్క ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం, జీవితంలో సుస్థిరమైన మరియు బలమైన ప్రారంభం కోసం తల్లిపాలు ఇవ్వడం' అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. తల్లిపాలు ఇవ్వడం ద్వారా అటు తల్లికి, ఇటు బిడ్డకు కలిగే విశేష ప్రయోజనాలను ఆమె వివరించారు. బిడ్డ పుట్టిన అరగంట లోపు తప్పనిసరిగా ముర్రుపాలు (కొలస్ట్రం) తాగించడం ద్వారా శిశువుకు సహజసిద్ధమైన వ్యాధినిరోధక శక్తి లభిస్తుందని స్పష్టం చేశారు. ఆరు నెలలు నిండే వరకు శిశువుకు ఎలాంటి బయటి ఆహారం ఇవ్వకుండా కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని సూచించారు. ఆరు నెలల తర్వాత నుంచి పిల్లలకు అనుబంధ పోషకాహారం ఇవ్వడం ప్రారంభిస్తూనే, రెండేళ్ల వయసు వచ్చే వరకు తల్లిపాలను తప్పనిసరిగా కొనసాగించాలని, తద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎంతో దృఢంగా ఎదుగుతారని ఆమె అవగాహన కల్పించారు. సమావేశం అనంతరం, తల్లిపాల ఆవశ్యకతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశంతో అధికారుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి తల్లిపాలకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి. జయభారతి, జి. సౌజన్య, డి. తులసి, ఎస్. గౌరీ, ఎం. లక్ష్మి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై రిలే నిరాహార దీక్షలు కొనసాగింపు..

### లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్సీపీ డిమాండ్




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 7:** డీఎస్సీ-2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ డిమాండ్ చేశారు.

విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలో జీవీఎంసీ గాంధీ పార్క్ వద్ద ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిరసనకారులు నల్ల రిబ్బన్లు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు, విశాఖ తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణికుమారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, డీఎస్సీ పరీక్షలు రాసిన లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపించారు. పరీక్షల ఫలితాలు వెలువడిన తర్వాత జీవోల్లో మార్పులు చేసి, కొత్త నిబంధనలు తీసుకువచ్చి అభ్యర్థులను మోసం చేశారని విమర్శించారు. డీఎస్సీ-2025 నియామకాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

అలాగే ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే వరకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఆగస్టు 9 వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని వాసుపల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం నాయకురాలు వంగపండు ఉషారాణి, రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, మాజీ కార్పొరేటర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థి, యువజన విభాగాల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో యువత, మహిళలు పాల్గొన్నారు.

## ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు భారీగా తరలిరావాలి....



తోట రాజీవ్

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 7 :**
మహానాయకుడు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన ముద్రగడ పద్మనాభం గారి సంస్మరణార్థం ఈ నెల 9న విశాఖపట్నంలో భారీ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు విశాఖ కాపునాడు జిల్లా అధ్యక్షుడు తోట రాజీవ్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ అరేనాలో ఈ సభ జరగనుందని ఆయన వెల్లడించారు.

ముద్రగడ పద్మనాభం గారు అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక సమానత్వం, సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన మహోన్నత నాయకుడని తోట రాజీవ్ పేర్కొన్నారు. కాపు సమాజంతో పాటు అన్ని వర్గాల ప్రజల గౌరవాన్ని పొందిన ప్రజానాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.

రాజకీయాలకు అతీతంగా విశాఖ జిల్లాలోని వివిధ సామాజిక సంఘాల ఐక్యతతో "విశాఖ కాపునాడు" ఆధ్వర్యంలో ఈ సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముద్రగడ ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, యువత ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.

ఈ సంస్మరణ సభకు కాపు కుటుంబ సభ్యులు, ముద్రగడ అభిమానులు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు, యువత, మహిళలు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ సభలో పాల్గొని మహానేతకు ఘన నివాళులు అర్పించాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం ముద్రగడ పద్మనాభం గారి సంస్మరణ సభ పోస్టర్‌ను తోట రాజీవ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీవీ సురేష్, కసిరెడ్డి సత్యనారాయణ, గుంటూరు నరసింహమూర్తి, వంగా ప్రభాకర్ రావు, గుడివాడ లతీష్, నవీన్, సుబ్బా విశ్వనాథ్, రాయుపు రెడ్డి అనిల్, కోసల శ్యామల దేవి, పండుగ్రి జయరాజు నాయుడు, సతీష్ తదితర కాపు నాయకులు పాల్గొన్నారు.

## పరవాడలో అధికారులతో ఎమ్మెల్యే పంచకర్ల సమీక్ష

### గ్రావెల్ అక్రమాలపై ఆధారాలుంటే ఇవ్వండి.. చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 7:** పరవాడ మండలంలో ప్రభుత్వ కార్యక్రమాల అమలు, పరిపాలనా వ్యవహారాలపై పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు శుక్రవారం మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పలు శాఖల పనితీరును సమీక్షించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ యంత్రాంగం పారదర్శకంగా పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. వ్యవస్థలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు.



అనంతరం మీడియాతో మాట్లాడిన పంచకర్ల రమేష్ బాబు, రాష్ట్రంలో గ్రావెల్ అక్రమాల నియంత్రణ కోసం ప్రభుత్వం ఏఎంఆర్ సంస్థకు బాధ్యతలు అప్పగించిందని తెలిపారు. ఆ సంస్థ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ అక్రమాలను అడ్డుకుంటున్నారని చెప్పారు.

ఇటీవల వందల కోట్ల రూపాయల గ్రావెల్ అక్రమాలపై మీడియాలో వస్తున్న కథనాలకు సంబంధించి ఎవరైనా ఆధారాలు ఉంటే తనకు అందజేయాలని మీడియా ప్రతినిధులను కోరారు. సరైన ఆధారాలు లేకుండా ప్రభుత్వం లేదా వ్యక్తులపై నిరాధార ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు.

గ్రావెల్ అక్రమాలకు సంబంధించిన సమాచారం ఎక్కడైనా అందితే అర్ధరాత్రి అయినా అరగంటలో అక్కడికి చేరుకుని అక్రమాలను అడ్డుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమికి చెందిన ఏ నాయకుడు అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏఎంఆర్ వ్యవస్థ ద్వారా గ్రావెల్ అక్రమాలపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగుతోందని, అక్రమాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

## డీఎస్సీ అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలి: చిన్న శ్రీను



**పద్మనాభం, ఆగస్టు 7 (పెన్ పవర్):** డీఎస్సీ--2025 ఉపాధ్యాయ నియామకాలలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అవకతవకలపై సి.బి.ఐ దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని విజయనగరం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) డిమాండ్ చేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న యువత పోరాట కార్యక్రమంలో భాగంగా పద్మనాభం మూడు రోడ్ల జంక్షన్లో చేపట్టిన రెండో రోజు రిలే నిరాహార దీక్షలో ఆయన తన కుమార్తె సిరమ్మతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాలలో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. క్రీడల కోటా కింద జరిగిన నియామకాలపైనా సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పద్మనాభం మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు కె. రాంబాబు, ఎస్. గిరిబాబు, కోరాడ లక్షణ, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమానికి వైఎస్సార్ కుటుంబం అండగా నిలిచింది: కె.కె. రాజు



**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 7 :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మద్దిలపాలెంలోని కృష్ణ కాలేజ్ రోడ్డులో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి వైఎస్సార్ కుటుంబం ఎల్లప్పుడూ అండగా నిలిచిందని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేనేత రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, ముడిసరుకు, విద్యుత్ చార్జీలు, మార్కెటింగ్ వంటి అంశాలపై చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. "నేతన్న నేస్తం" వంటి సంక్షేమ పథకం ద్వారా వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారని గుర్తు చేశారు.

చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, పద్మశాలి సామాజిక వర్గానికి రాజకీయంగా సముచిత అవకాశాలు కల్పించిందని తెలిపారు. విశాఖ జిల్లాలో పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు కల్పించేందుకు కృషి చేస్తానని, పద్మశాలి సామాజిక వర్గానికి మరింత ప్రాధాన్యత కల్పించే అంశంపై పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డితో చర్చిస్తానని చెప్పారు.

జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో చేనేత వర్గాలకు రాజకీయ, సామాజికంగా విశేష ప్రాధాన్యత లభించిందని, భవిష్యత్తులో కూడా వారి సంక్షేమం కోసం పార్టీ కట్టుబడి ఉంటుందని అన్నారు.

కార్యక్రమంలో పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవి రెడ్డి, చేనేత విభాగం నాయకులు వానపల్లి ఈశ్వరరావు, సురేశెటి సూరిబాబు, యద్దలుపు వెంకటేశ్వర్లు, నీలి రవి, హేమలత, పల్లివేస్లి ఈశ్వరి, గదే రాజు, కాకి పద్మా, కొయ్యపాక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ సంపద కాపాడడానికి ప్రజల సహాయ సహకారం కావాలి



**జి.మాడుగుల.పెన్ పవర్.ఆగస్ట్(7)** అడవి సంపదన కాపాడడమే అటవీ శాఖ అధికారుల ధ్యేయం. అందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం.జి.మాడుగుల. అడవులను అడవి సంపదను కాపాడమే అటవీ శాఖ ద్యేయమని అటవీ సంపాదన కాపాడడం వల్ల పర్యావరణ పరిరక్షణ ఉంటుందని అటవీ శాఖ అధికారి జై ప్రశాంత్ కుమారి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా లోతుగడ్డ రేంజ్ అన్నవరం సెక్షన్ పరిధిలోని మడత కొండ ప్రాంతంలో శుక్రవారం నాడు డోన్ సహకారంతో 10 ఎక్టారలో ఐదువేల చింత విత్తన బంతులనువిధ జలడం జరిగింది.. వీటివల్ల ఉత్తరం నుంచి మొక్కలు నాటి అడవి సంపద పెరుగుతుందని అందువలన పర్యావరణ పరిరక్షణకు రక్షణ కలుగుతుందని ఆమె అన్నారు. వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎఫ్.ఎస్.ఓ.ఎం.బాబురావు. ఏ.బి ఓ.జే.దివ్య.ఏ.గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

# దిశా చట్టం రద్దుపై వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నిరసన

- మహిళల భద్రతను బలహీనపరిచే నిర్ణయమని విమర్శలు
- వెంటనే ఉపసంహరించుకోవాలని
- ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి డిమాండ్




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 7 :**దిశా చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖపట్నంలోని జీవీఎంసీ జంక్షన్‌లో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు కె.కె. రాజు సూచనల మేరకు విశాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి పాల్గొని ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించారు.

ఈ సందర్భంగా వరుదు కళ్యాణి మాట్లాడుతూ, మహిళల భద్రత కోసం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రూపొందించిన దిశా చట్టాన్ని రద్దు చేయడం మహిళల రక్షణను బలహీనపరిచే చర్య అని అన్నారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న చట్టానికి ఆమోదం తీసుకురావాల్సిన ప్రభుత్వం, చట్టాన్నే రద్దు చేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. దిశా చట్టం అమల్లోకి వస్తే మహిళలపై జరిగే నేరాల కేసుల్లో వేగవంతమైన విచారణ జరిగి బాధితులకు త్వరితగతిన న్యాయం లభించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో దిశా యాప్, ప్రత్యేక దిశా పోలీస్ స్టేషన్లు, మహిళా పోలీసుల నియామకం వంటి చర్యలు మహిళల భద్రతకు బలమైన వ్యవస్థగా నిలిచాయని ఆమె తెలిపారు. దిశా పేరును, వ్యవస్థను నిర్వీర్యం చేయడం ద్వారా ప్రభుత్వం మహిళల్లో ఉన్న భరోసాను దెబ్బతీస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు పెరుగుతున్న నేపథ్యంలో రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, దిశా చట్టాన్ని రద్దు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

హోంమంత్రి బీఎన్ఎస్ చట్టాలను ప్రస్తావించడం సరైన వాదన కాదని, దిశా చట్టం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ మహిళల రక్షణ కోసం రూపొందించబడిందని స్పష్టం చేశారు. దిశా చట్టం రద్దు నిర్ణయానికి నిరసనగా క్యాబినెట్ నిర్ణయాల ప్రతులను దగ్ధం చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు క్షమాపణ చెప్పి, దిశా చట్టం రద్దు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విశాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించే దిశా వ్యవస్థను రద్దు చేయడం రాష్ట్ర మహిళా లోకానికి అన్యాయం అని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. దిశా చట్టాన్ని పునరుద్ధరించకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్‌తో పాటు మహిళా నాయకులు శ్రీదేవి వర్మ, బయ్యవరపు రాధా, బి. పద్మావతి, షబీర బేగం, సత్యాల సాగరిక, ఎం. విశాలక్ష్మి, రోజారాణి, రీసు అనురాధ, రజిని, మజ్జి జ్యోతి, పార్వతి, జోషిల, దమయంతి, భాను, శిరాష, కృష్ణవేణి, సత్య తదితరులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వాతావరణ మార్పులకు విరుగుడు.. 'వలిసెల' సాగు.

- తక్కువ నీటితో అదనపు ఆదాయం.
- చింతపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో రైతులకు అవగాహన సదస్సు.




**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 7.**వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత విపత్కర తరుణంలో.. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ఈ నేపథ్యంలో విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చింతపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో "వలిసెల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు" అనే అంశంపై రైతులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని నిలబడే వలిసెల పంటకు ఉన్న ప్రాధాన్యతను రైతులకు వివరించారు. వర్షపాతం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సైతం ఈ పంటను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని, అతి తక్కువ నీటితోనే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని ఆమె స్పష్టం చేశారు. అనంతరం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బాల హుస్సేన్ మాట్లాడుతూ.. వలిసెల సాగులో రైతులు తప్పనిసరిగా అనుసరించాల్సిన 'బంగారు తీగ' యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తనాలు జల్లే విధానం, సరైన సమయంలో విత్తుకోవడం, పొలంలో మొక్కల సాంద్రతను సమతుల్యంగా కాపాడుకోవడం తదితర కీలక మెలకువలను ఆయన రైతులకు పూసగుచ్చినట్లు వివరించారు. పంట సాగులో రసాయనాల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ పద్ధతిలో పోషక, చీడపీడలు, తెగుళ్ల యాజమాన్యం చేపట్టే విధానంపై వ్యవసాయ సాంకేతిక నిపుణులు డాక్టర్ అప్పలరాజు రైతులకు దిశానిర్దేశం చేశారు. రైతులు కేవలం పంటను పండించి విక్రయించడమే కాకుండా, దానికి విలువ జోడించడం ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావచ్చని సూచించారు. వలిసెల గింజల నుంచి నూనెను ఉత్పత్తి చేసి స్థానికంగా చిన్న తరహా వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమల ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలని కోరారు. తద్వారా రైతులు, గ్రామీణ యువత కేవలం ఉత్పత్తిదారులుగానే మిగిలిపోకుండా.. వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అద్భుతమైన అవకాశం ఉందని ఆయన ఉద్ఘాటించారు. తక్కువ పెట్టుబడితో స్థిరమైన లాభాలు అందించే వలిసెల సాగు రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు ఈ సదస్సు ద్వారా స్పష్టం చేశారు.

# డీఎస్సీ అక్రమాలపై రిలే నిరాహార దీక్షలో వైఎస్సార్‌సీపీ నేతల ఆందోళన

- విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు
- 35వ వార్డు అధ్యక్షుడు అలుపన కనకారెడ్డి ఆధ్వర్యంలో నిరసన




**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ విశాఖపట్నం, ఆగస్టు 7:**డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన దీక్షలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు, విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశాల మేరకు 35వ వార్డు అధ్యక్షుడు అలుపన కనకారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 35వ వార్డు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు కోసం సీబీఐ విచారణకు ఆదేశించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యువత, విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని హెచ్చరిస్తూ నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో అబ్బిరెడ్డి ఆదివిష్ణు రెడ్డి, జీరు సూర్యనారాయణ రెడ్డి, కర్రీ రాము, కె. గంగాధర్, నాయన శ్రీనివాస్ రెడ్డి, నాగిరెడ్డి, ఈశ్వరరావు, పోలవరపు రమణమ్మ, పిల్లి నగేష్, జుత్తాక దుర్గాప్రసాద్, గునూరు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, దొడ్డి కృష్ణవేణి, కాకర కొండమ్మ, దేవర రాజు, దేవర రత్నం, ముద్దాడ గణేష్, చెన్నా లక్ష్మణరావు, చెప్పా లక్ష్మణరావు, రెడ్డి మహేష్, పులి హేమలత, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# సిగినపల్లిలో గిరిజన రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ



ఒకే గ్రామంలో 141 పట్టాదారు పాస్‌పుస్తకాల అందజేత

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 7:**గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీ పరిధిలోని సిగినపల్లి గ్రామ గిరిజన రైతుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గిరిజన రైతులకు భూ హక్కు పత్రాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. మొత్తం 150 పాస్‌పుస్తకాలకు గాను 141 పత్రాలను అర్హులైన రైతులకు అందజేశారు. మండలంలో ఒకే గ్రామంలో ఇంత పెద్ద సంఖ్యలో భూ హక్కు పత్రాలు పంపిణీ చేయడం విశేషంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ ఆదేశాలు, తహసీల్దార్ సూచనల మేరకు డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రక్రియను పూర్తి చేసి రైతులకు పాస్‌పుస్తకాలను అందజేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా భూమిపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న గిరిజన రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. తరతరాలుగా కొండకోనల్లో సాగు చేసుకుంటూ వస్తున్నప్పటికీ భూమిపై చట్టబద్ధమైన హక్కులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందడం గొప్ప ఊరటనిచ్చింది. భూ హక్కు పత్రాలు చేతికి రావడంతో తమ భూములకు భద్రత కలిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. భూ హక్కు పత్రాలు అందడంతో రైతులకు భవిష్యత్తులో పంట రుణాలు పొందేందుకు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలను వినియోగించుకునేందుకు మరింత వెసులుబాటు కలగనుంది. అలాగే అధికారిక రికార్డుల్లో భూమి హక్కులు నమోదుకావడంతో భూ వివాదాలు, అక్రమ ఆక్రమణలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అర్హులైన గిరిజన రైతులను గుర్తించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడం, భూ వివరాలను పరిశీలించడం, డిజిటల్ పాస్‌పుస్తకాలను సిద్ధం చేయడం వంటి ప్రక్రియలను రెవెన్యూ అధికారులు పూర్తి చేశారు. 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమం ద్వారా పారదర్శకంగా భూ హక్కు పత్రాలను అందజేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, జనసేన అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీర వెంకట్, మండల పీసా ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు, మాజీ ఎంపీపీ సాగిన బాలరాజు, మాజీ సర్పంచ్ కుందేరి రామకృష్ణ, పీసా సభ్యులు రాధాకృష్ణ, గౌరీశంకర్, కర్రయ్య, కూటమి నాయకులు పాండురాజు, నాగరాజు, రామ్మూర్తి, గ్రామ పెద్దలు, వీఆర్వో తగ్గి రామారావు, సర్వేయర్ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. "భూమికి హక్కు. రైతుకు భరోసా"గా సిగినపల్లి పట్టాల పంపిణీ కార్యక్రమం నిలిచింది.

# రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ ను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర శంకర్రావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 07.**నేడు జరిగే రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ ను జయప్రదం చేయాలనీ ముంచంగిపుట్టు మండలంలోనీ ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు మారుమూల రంగబయలు పంచాయతీ, పట్నపడాల్ పుట్టు, రంగబయలు గ్రామాల ప్రజలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కొర్ర శంకర్రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, జిఓ నెంబర్ 3ను పునరుద్ధరణ చేయాలనీ నేడు రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ చేపడతామన్నారు. అదే విధంగా కించాయిపుట్టు పంచాయతీ దారపల్లిలో మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ, గిరిజన మహిళా సంఘం ఐద్వా కార్యదర్శి సీసా విజయ లక్ష్మి బంద్ ను సంబంధించి పోస్టర్ ను ఆవిష్కరించారు. మండల వ్యాప్తంగా సిపిఎం, గిరిజన సంఘం నాయకులు మన్యం బంద్ ను విజయవంతనికి మద్దతు కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాధురం, మత్స్యారాజు, భీమన్న, పాంగి సావు, ఎస్ సుక్ర, పీ జగనాధం, కె మాంద్రి, కె సన్ను, పి సొమ్ర, తదితరులు పాల్గొన్నారు..

# కేజీహెచ్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవం ముగింపు




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 07 :** ఆంధ్ర మెడికల్ కళాశాల, కింగ్ జార్జి ఆసుపత్రి శిశువైద్య విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవం శుక్రవారం ఘనంగా ముగిసిం ది. ఈ ఏడాది "బ్రెస్ట్‌ఫీడింగ్ ఫర్ ఎ సస్టె యినబుల్ స్టార్ట్ ఇన్ లైఫ్ -- స్ట్రెంగ్తెన్ వాట్ వర్క్స్" అనే అంశంతో కార్యక్రమాలను నిర్వహించారు. వారోత్సవంలో భాగంగా అధ్యాపకులు, పీజీ, యూజీ విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది, ఎన్ఆర్సీ, డీఈఐసీ, స్కూల్ హెల్త్ విభాగాల ప్రతినిధులు తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ప్రసవం జరిగిన మొదటి గంటలోనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం, తొలి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలనే అందించడం, అనంతరం పరిపూ రక ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగిం చడం వంటి అంశాలపై తల్లులకు అవగాహన కల్పించారు.

యూజీ విద్యార్థుల ఆధ్వర్యంలో స్కిట్లు, పోస్టర్ ప్రదర్శనలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. శిశువైద్య విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి తల్లిపాల ప్రాముఖ్యతపై ఆకాశవాణి, టెలివిజన్ మాధ్యమాలకు ప్రత్యేక ఇంటర్వ్యూలు ఇచ్చారు.

ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి మాట్లాడుతూ, ప్రజారోగ్య కార్యక్రమాల నిర్వహణలో శిశువై ద్య విభాగం చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధ్యాపకు లకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యవాణి, అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాలను డాక్టర్ ఎం. గిరిధర్ సమన్వయం చేయగా, డాక్టర్ తాటం నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో తల్లిపాలపై శాస్త్రీయ అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు

# ఆదివాసులకు శాసన మండలిలో ప్రాతినిధ్యం కల్పించాలి.

**రాష్ట్ర అధ్యక్షులు ట్రైబల్ రైట్స్ ఫారం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు.**



**గుమ్మలక్ష్మీపురం ఆగస్టు 07 పెన్ పవర్.**ఆదివాసీ సమాజానికి రాజకీయంగా,శాసనపరంగా తగిన గుర్తింపు,ప్రాతినిధ్యం కల్పించేందుకు శాసన మండలి సభ్యులుగా అవకాశం ఇవ్వాలని ట్రైబల్ రైట్స్ ఫోరం (టిఆర్ఎఫ్)రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు శుక్రవారం నాడు పత్రిక విలేకరుల ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రాష్ట్ర జనాభాలో గణనీయమైన వాటా కలిగిన ఆదివాసీల హక్కులు,సమస్యలు శాసన సభలోనే కాకుండా శాసన మండలిలో కూడా బలంగా వినిపించాల్సిన అవసరం ఉంది.దశాబ్దాలుగా ఆదివాసీలకు పైస్థాయి నిర్ణయాల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల వారి భూ హక్కులు,విద్య,ఆరోగ్యం,అటవీ హక్కులకు సంబంధించిన అనేక అంశాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి అని అన్నారు.శాసన మండలిలో ఆదివాసీలకు కనీసం 2 స్థానాలుకేటాయించాలి గిరిజన సంక్షేమానికి సంబంధించిన బిల్లులపై చర్చలో ఆదివాసీ ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి,ట్రైబల్ సబ్-ప్లాన్ నిధుల వినియోగంపై మండలిలో ప్రత్యేక సమీక్ష నిర్వహించాలి.పోడు భూములు,గిరిజన విద్యార్థుల రిజర్వేషన్లు,పేస అమలుపై మండలి ద్వారా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సామాజిక న్యాయం అంటే కేవలం మాటల్లోనే కాదు,విధాన నిర్ణయాల్లోనూ ఆదివాసీల భాగస్వామ్యం ఉండాలి.ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం,గవర్నర్ కార్యాలయం తక్షణమే చర్యలు తీసుకోవాలని రొబ్బా లోవరాజు స్పష్టం చేశారు.

## లింక్డ్ఇన్ జాబితాలో విశాఖకు తొలి స్థానం

* ఉద్యోగాల కల్పనలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా గుర్తింపు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 07 :** ఉద్యోగ అవకాశాలు, పెట్టుబడులు, సాంకేతిక రంగాల విస్తరణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబి తాలో విశాఖపట్నం దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. లింక్డ్ఇన్ విడుదల చేసిన 'సిటీస్ ఆన్ ది రైజ్--2026' జాబి తాలో విశాఖకు ఈ గుర్తింపు లభించింది.ఉద్యోగ నియామ కాల పెరుగుదల, ఉద్యోగాలపై డిమాండ్, కొత్త ప్రతిభావం తులు నగరానికి రావడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ జాబితాను రూపొందించినట్లు లింక్డ్ఇన్ వెల్లడించింది. ముఖ్యంగా సమాచార సాంకేతికం, కృత్రిమ మేధ (ఏఐ), రసాయన పరిశ్రమలు, డిజిటల్ సేవల రంగాల్లో విశాఖ గణనీయమైన పురోగతిని నమోదు చేసినట్లు పేర్కొంది.రాష్ట్ర ప్రభుత్వం విశాఖను సాంకేతిక, పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోం ది. ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, కృత్రిమ మేధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో గూగుల్, రిలయన్స్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థలు విశాఖలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.గూగుల్ ప్రతిపాదించిన ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్టులు విశాఖ అభివృద్ధికి దోహదపడ నున్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.లింక్డ్ఇన్ నివేదిక ప్రకారం విశాఖలో సుమారు 17.1 శాతం ఉద్యోగాలు రిమోట్ విధానంలో, మరో 5.2 శాతం ఉద్యోగాలు హైబ్రిడ్ విధానంలో కొనసాగుతున్నాయి. దీంతో సంప్రదాయ పరిశ్రమలతో పాటు సాంకేతిక రంగాల్లోనూ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.
విశాఖను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికా రులు తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పోర్టు నగరంగా పేరొందిన విశాఖ, క్రమంగా ఏఐ, ఐటీ రంగాలకు కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యం....

అంగన్వాడీ సూపర్వైజర్ రాఘవ వెల్లడి.....



**నాతవరం,పెన్ పవర్ (ఆగస్టు 07):** తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యమని అంగన్వాడి సూపర్వైజర్ రాఘవ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో గల చమ్మ చింత గ్రామంలో గోలుగొండ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ సూపర్వైజర్ రాఘవ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ రాఘవ మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని తెలిపారు.మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని,అనంతరం పోషకాహారంతో పాటు తల్లిపాలు కొనసాగించాలని సూచించారు.గర్భిణీలు,బాలింతలు పోషకాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. శిశువుల సంరక్షణ,తల్లుల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దత్తత విధానాలపై కూడా వివరించారు.చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారానే దత్తత తీసుకోవాలని, రిలేటివ్ అడాప్షన్ (=వశ్రీఖఅజవ ూాంశీజూఅశీఅ), స్టెప్ అడాప్షన్ (ూవజూ ూాంశీజూఅశీఅ) వంటి విధానాల గురించి తల్లిదండ్రులకు వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు,గర్భిణీలు,బాలింతలు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లంకపాకలు ఎంపీపీ పాఠశాలలో ఇన్‌చార్జ్ ఎంఈఓ పీవీ ప్రసాద్ ఆకస్మిక తనిఖీ

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎంఈఓ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 7:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం లంకపాకలు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను ఇన్‌చార్జ్ మండల విద్యాశాఖ అధికారి పీవీ ప్రసాద్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈఓ.. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని పీవీ ప్రసాద్ సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఆయన అన్నారు.ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల అవసరాలు, విద్యాబోధనకు సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయులతో ఎంఈఓ చర్చించారు.

# యువనేత చింతకాయల రాజేష్ సమక్షంలో టీడీపీలోకి భారీ చేరికలు

* అభివృద్ధి -- సంక్షేమమే ఆకర్షణ... వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీ గూటికి.....
* స్పీకర్ తనయుడు యువ నేత చింతకాయల రాజేష్.....



**నాతవరం,పెన్ పవర్ (ఆగస్టు 07):** కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,సంక్షేమానికి ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారని స్పీకర్ తనయుడు, యువనేత చింతకాయల రాజేష్ అన్నారు. శుక్రవారం మండలంలో గల మర్రిపాలెం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఏపీ పురం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు మాజీ సర్పంచ్ పైల రమేష్,టీడీపీ నాయకుడు పారుపల్లి రాము ఆధ్వర్యంలో స్పీకర్ తనయుడు,యువనేత చింతకాయల రాజేష్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా చింతకాయల రాజేష్ మాట్లాడుతూ, పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారని అన్నారు.ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, పారదర్శక పాలనకు ప్రజలు మద్దతు తెలుపుతున్నందున ఇతర పార్టీల నుంచి టీడీపీలో చేరికలు నిరంతరం కొనసాగుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు,నేతల విజయ్ కుమార్ విజయ్ కుమార్, మండల తెలుగు యువత అధ్యక్షులు పోలుపర్తి సాయి, సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కూండ్రపు అప్పలనాయుడు,టీడీపీ సీనియర్ నాయకులు విజయ్,మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు శెట్టి లోవ, మండల సోషల్ మీడియా కన్వీనర్ శెట్టి గోపి,పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన....



* 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం ద్వారా కార్యాచరణ ప్రణాళిక అమలు....
* ఎల్ నినో ప్రభావంతో ఏ ఒక్కరైతు నష్టపోకూడదు...
* తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ......
* ప్రతి రైతు పంట బీమా చేయించుకోవాలి...
* మండల వ్యవసాయ అధికారి జి. సుగుణ...

**నాతవరం,పెన్ పవర్ (ఆగస్టు 7):** ఎల్ నినో ప్రభావం కారణంగా రైతులు నష్టపోకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు శుక్రవారం నుంచి ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి జి. సుగుణ తెలిపారు.మండల కేంద్రమైన నాతవరం లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతుల పొలాలను సందర్శించి వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటల సాగుపై రైతులకు సూచనలు అందిస్తామని చెప్పారు. ఎల్ నినో ప్రభావంతో నీటి కొరత,పంటలు ఎండిపోవడం, వాడిపోవడం వంటి పరిస్థితులను పరిశీలించి, పంటలను రక్షించేందుకు జీవరక్షక తడులు, మల్చింగ్ పద్ధతులు, రాయితీపై స్ప్రింక్లర్, డ్రిప్ సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ (గ్రావీణూ) సాగు, జీవ వైవిధ్యంతో కూడిన మిశ్రమ పంటలు, అంతర పంటల సాగును ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట బీమా చేయించుకునేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.తాండవ రిజర్వాయర్ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ,ఎల్ నినో ప్రభావంతో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా వ్యవసాయ, అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ డీఈ, ఏఈ, వివిధ గ్రామాల అభ్యుదయ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం.....




* పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో ముఖ్యం...
* గునుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ అనూష....

**నాతవరం,పెన్ పవర్ (ఆగస్టు 07):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం మన్యపురుట్ల సచివాలయంలో అంగన్వాడీ సూపర్వైజర్ కె. విజయకుమారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గర్భిణీలు,బాలింతలు,చిన్నారుల తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గునుపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ అనూష హాజరై మాట్లాడుతూ పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో ముఖ్యమని తెలిపారు.తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అదనంగా నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు అవసరం లేదని వివరించారు.తల్లిపాలలో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు సమృద్ధిగా ఉండటంతో పాటు,వ్యాధి నిరోధక శక్తి పెంపొందించి వివిధ అంటువ్యాధుల నుంచి రక్షిస్తాయని చెప్పారు.అదేవిధంగా తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులకు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, ప్రసవానంతరం త్వరగా కోలుకోవడంతో పాటు కొన్ని దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని వివరించారు.ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని,ఇది శిశువు ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వనీమిన సూర్యారావు, గ్రామ పెద్ద వీసం నూకరాజు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, హెల్త్ సూపర్వైజర్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ పలు సూచనలు,సలహాలు అందించారు. గర్భిణీలు,బాలింతల సందేహాలను నివృత్తి చేస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలి,సరైన పోషకాహారం, శిశు సంరక్షణపై కూడా వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

## డ్రైనేజీల దుర్వాసన - ఇబ్బంది పడుతున్న ప్రజలు

* మండల కేంద్రంలో డ్రైనేజీలను వెంటనే శుభ్రపరచాలి.
* పిజిఆర్ ఎస్ లో డీపీఓకు వైసీపీ మండల నేత మొశియ వెంకట్ వినతి.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 07.** ముంచంగిపుట్టు మండల కేంద్రంలో డ్రైనేజీలను సక్రమంగా నిర్వహించకపోవడం, కొన్ని డ్రైనేజీలను మూసివేయడం వల్ల వర్షపు నీటితో పాటు చెత్తాచెదారం రహదారులపై ప్రవహిస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైసిపి నాయకుడు, సామాజిక కార్యకర్త మొశియ వెంకట్ తెలిపారు. ఈ సమస్యపై శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన అన్నారు. డ్రైనేజీలు మూసి వేయబడటంతో వర్షపు నీరు నిల్వ ఉండి దుర్వాసన వ్యాపిస్తోందని, దీంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉన్నందున డ్రైనేజీలను వెంటనే శుభ్రపరచడంతో పాటు, మూసి వేసిన డ్రైనేజీలను



తెరిచి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టాలని డీపీఓను కోరారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని మొశియ వెంకట్ విజ్ఞప్తి చేశారు.

## ఆగస్టు 9న రామన్నపాలెం రానున్న శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు...

* కూటమి శ్రేణులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలి....
* మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ...



**నాతవరం,పెన్ పవర్ (ఆగస్టు 07):** ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 9వ తేదీ ఆదివారం నాతవరం మండలం రామన్నపాలెం గ్రామంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి ప్రపంచ ఆదివాసుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ శుక్రవారం తెలిపారు.ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుందని, ముఖ్య అతిథిగా రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొని ఆదివాసి సమాజ అభివృద్ధి, సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు.ప్రపంచ ఆదివాసుల దినోత్సవం సందర్భంగా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, వారి హక్కుల పరిరక్షణ, సామాజిక అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ జిల్లా స్థాయి కార్యక్రమానికి నాతవరం మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ,మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు,నేతల విజయ్ కుమార్, మండల తెలుగు యువత అధ్యక్షులు పోలుపర్తి సాయి తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నలకు అండగా కూటమి ప్రభుత్వ

-అధికారికంగా జాతీయ చేనేత దినోత్సవం




**గాజువాక: పెన్ పవర్, ఆగస్టు 07:**జాతీయ చేనేత దినోత్సవాన్ని గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అధికారికంగా నిర్వహించారు.ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత రంగం రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు.నేతన్నల సంక్షేమం, చేనేత పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని,వారికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తున్నామని చెప్పారు.చేనేత వస్త్రాలను ప్రజలు ఎక్కువగా వినియోగించడం ద్వారా నేతన్నలకు ఉపాధి, ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.నేతన్నల సేవలో పథకానికి 250 కోట్లు వెచ్చిస్తూ 52 వేల మంది అర్హులకు 25 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది అని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వం నేతన్నల ఆశలపై నీళ్లు చల్లిందని ఆరోపించారు.బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి డి వి సత్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త,ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్,స్వర్ణపూడి రాంబాయి,మాజీ కార్పొరేటర్ బొండా జగన్,విల్లా రామ్మోహన్ కుమార్,నల్లూరు సూర్య నారాయణ,గోమాడ వాసు,పప్పు అప్పారావు,దొడ్డి మల్లేశ్వరరావు,కనక భవానీ ప్రజాప్రతినిధులు,చేనేత కార్మికులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నో రోజుల చిరకాల వాంఛ నెరవేరింది....

- ఆగస్టు 11న తాండవ నీరు విడుదల...
- నాతవరం--తాండవ రహదారిని ప్రారంభం చేయునున్న అయ్యన్నపాత్రుడు.......
- తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ....



**నాతవరం,పెన్ పవర్ (ఆగస్ట్):** నాతవరం మండల ప్రజలు,రైతులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రెండు కీలక కార్యక్రమాలు ఆగస్టు 11న సాకారం కానున్నాయని తాండవ రిజర్వాయర్ చైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు.తాండవ రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేయడంతో పాటు నాతవరం--తాండవ నూతన రహదారిని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.
శుక్రవారం మర్రిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాండవ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు.దీంతో ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్య తీరడంతో పాటు ఖరీఫ్ సాగుకు అవసరమైన నీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు.
అదేవిధంగా తాండవ పరిసర ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నాతవరం--తాండవ రహదారి నిర్మాణ పనులు పూర్తయ్యాయని,ఆగస్టు 11న ఆ రహదారిని ప్రజలకు అంకితం చేయనున్నట్లు పేర్కొన్నారు.ఈ రహదారి అందుబాటులోకి రావడంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడి గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు రైతులు, స్థానిక ప్రజలకు విశేష ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నారని కరక సత్యనారాయణ తెలిపారు.ఆగస్టు 11న జరిగే ఈ కార్యక్రమాలకు రైతులు,ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ,మాజీ ఎంపీపీ లు పారుపల్లి కొండబాబు,నేతల విజయ్ కుమార్, మండల తెలుగు యువత అధ్యక్షులు పోలుపర్తి సాయి, మాజీ మండల తెలుగు యువత అధ్యక్షులు శెట్టి లోవ, సోషల్ మీడియా కన్వీనర్ శెట్టి గోపి,టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మార్పు అవసరం

- కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పాదయాత్ర చేపడతాం



**జి.మాడుగుల పెన్ పవర్ ఆగస్ట్(7)** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బద్లావ్ జరూరీ హై (మార్పు అవసరం) అనే నినాదంతో ఆగస్టు 6 నుంచి 15వ తేదీ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఐ అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పొట్టిగి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలను వెంటనే నియంత్రించాలని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సార్వత్రిక విద్య, ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకునేలా రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ కల్పించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించేలా ప్రతి యువకుడికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. మహిళలకు పార్లమెంట్, శాసనసభల్లో మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని, దళితులు, ఆదివాసులపై జరుగుతున్న దాడులు, అకృత్యాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ పాదయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి. పండుబాబు, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు ఉల్లి ప్రసాద్, కే. సత్తిబాబు, కే. బాబురావు, జి. శ్రీనుబాబు, కే. శ్రీను, వి. శంకర్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

# శక్తీ శాట్‌కు ఎంపికైన కందుల జెస్సిని సత్కరించిన డా. గోరంట్ల రవికిరణ్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 7:**రూరల్ నియోజకవర్గం ధవలేశ్వరం గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కందుల జెస్సి ఇటీవల ప్రతిష్ఠాత్మకమైన శక్తీ సాట్ కార్యక్రమానికి ఎంపిక కావడం పట్ల టీడీపీ ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవి రామ్ కిరణ్ ని కలిశారు.
ఈ సందర్భంగా డా. గోరంట్ల రవి రామ్ కిరణ్ కందుల జెస్సికి శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఆమె సాధించిన ఈ ఘనత రూరల్ నియోజకవర్గానికే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. అనంతరం పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు తమ్మిశెట్టి పద్మ జ్యోత్స్న , ఎంఈఓ తులసిదాస్ , విద్యార్థిని తల్లిదండ్రులతో డా. గోరంట్ల రవి రామ్ కిరణ్ మాట్లాడారు. కందుల జెస్సి విజయం వెనుక ఉన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల శ్రీను, అరుణ కృషిని అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఆమెకు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.
డా. గోరంట్ల రవి రామ్ కిరణ్ శక్తీ సాట్‌కు ఎంపిక కావడం కందుల జెస్సి ప్రతిభకు నిదర్శనమ న్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చు కునే సామర్థ్యం కలిగి ఉన్నారని ఆమె నిరూపించిందన్నారు. విద్యార్థులకు,ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని పేర్కొన్నారు. కందుల జెస్సి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ ద్వారా కందుల జెస్సి విద్యాభ్యాసం, భవిష్యత్ ప్రయాణానికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు తమ వంతు పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ప్రతిభను ప్రోత్సహించడం సమాజం బాధ్యత అని, ఇలాంటి విద్యార్థులకు అండగా నిలవడం మరెందరికో స్ఫూర్తినివ్వా లనే లక్ష్యంతో జీఎస్ఆర్ ఫౌండేషన్ పనిచేస్తుందని తెలిపారు.

# పారిశ్రామికాభివృద్ధికి పెట్టుబడులకు అనుకూల వాతావరణం




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 07 :** జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పిం చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పారిశ్రామిక, ఎగు మతుల ప్రోత్సాహక కమిటి సమావేశంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు.
పరిశ్రమలకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్, పీజీఆర్ఎస్, ప్రత్యక్ష వినతుల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని కలెక్టర్ సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించి, దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై కార్యాచరణ నివేదికలను పరిశీలించిన ఆయన, పెండింగ్‌లో ఉన్న అంశా లను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయాలని ఆదేశించారు.
పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భూ లభ్యత, రహదారి అనుసంధానం, నీటి సరఫరా, విద్యు త్ సౌకర్యాల కల్పనలో జాప్యాలకు తావులేకుండా చూడాలని పేర్కొన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతులు, క్లియరెన్సుల మంజూరులో ఆలస్యం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
ఎంఎస్ఎంఈలకు అందించే పెట్టుబడి సబ్సిడీ, వడ్డీ సబ్సిడీ, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్ వంటి ప్రోత్సాహకాలను అర్హులైన యూనిట్లకు త్వరితగతిన అందించాలని కలెక్టర్ సూచించారు. అలాగే పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ యోజన పథకాల అమలుపై సమీక్ష నిర్వహించి, యువతతో పాటు సంప్రదాయ వృత్తిదారులకు ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.జిల్లాలో కుదిరిన అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు), వాటి పురోగతి, పారిశ్రామిక పార్కుల అభివృద్ధి, ఎగుమతుల ప్రోత్సాహానికి తీసుకుంటు న్న చర్యలపై కూడా సమావేశంలో చర్చించారు. "డిస్ట్రిక్ట్ యాజ్ ఎక్స్‌పోర్ట్ హబ్" కార్యక్రమం ద్వారా స్థానిక ఉత్ప త్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చేరువ చేయా లని కలెక్టర్ సూచించారు.పరిశ్రమల స్థాపన, విస్తరణకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడిదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు.
ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, ఏపీఐఐసీ అధికారులు, పారిశ్రామిక వేత్తలు, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై నిరసనలు కొనసాగింపు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 07 :**డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో దక్షిణ నియో జకవర్గంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి.జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో 33, 34, 35, 29వ వార్డుల అధ్యక్షులు ముత్తాబత్తుల రమేష్, తోట పద్మావతి, అలుపున కనకరెడ్డి, పీతల వాసు దీక్షలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉషారాణి, జిల్లా మహిళా అధ్యక్షు రాలు పేడాడ రమణకుమారి, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీతో పాటు పలువురు పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల నిర్వహణలో అవకత వకలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ భృతిని చెల్లించాలని కోరారు.ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్షలు రాసిన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.
ఈ సందర్భంగా గిరిజన కళాకారులతో కలిసి వాసుపల్లి గణేష్ కుమార్ దింసా నృత్యంలో పాల్గొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు వంగపండు ఉషారాణి పాటల ద్వారా నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు.
ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, యువజన, విద్యార్థి విభాగాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గింజర్తి పాఠశాలలోనే 3,4,5 తరగతుల కొనసాగింపు...!

- ఫలించిన విద్యార్థుల తల్లిదండ్రుల పోరాటం...
- జిల్లా కలెక్టర్, డి ఈ ఓ ఆదేశాలతో దీక్షలు విరమణ.



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 7:** ఐదు రోజుల పాటు చేపట్టిన దీక్షలు,వంటవార్పులతో జిల్లా అధికార్లు స్పందించారు. జిల్లా కలెక్టర్ మరియు డి ఈ ఓ, ఎం ఈ ఓల మధ్య జరిగిన చర్చల అనంతరం ఇప్పటివరకు పౌండేషన్ స్కూల్ గా ఉన్న గింజర్తి పాఠశాలను ' బేసిక్ ప్రేమేరీ పాఠశాల ' (1 నుండి 5 వ తరగతి వరకు) కొనసాగించాలని నిర్ణయించబడిన నేపథ్యంలో తిరిగి పాత స్కూల్ అయిన గింజర్తి లో త్వరలోనే 3,4,5 తరగతులను ఆయా విద్యార్థులకు విద్యను అభ్యసించేలా అవసరమైన చర్యలు చేపట్టినట్టు మండల విద్యాశాఖ అధికారి సింహాచలం తెలియజేశారు.ఈ విజయానికి కారణమైన గ్రామ ప్రజల ఐక్యత, ఎస్ఎంసీ సభ్యుల కృషి,గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు నాయకత్వ,సహకారానికి ఎంఈ ఓ హృదయ పూర్వక అభినందనలు వ్యక్తం చేశారు.త్వరలోనే పాఠశాల పరిసరాలను ,పరిశు భ్రంగా ఉంచి, పండ్ల మొక్కలు, పూల మొక్కలు అలంకార మొక్కలు నాటి పచ్చదనంతో నింపండని అన్నారు.త్వరలోనే విడుదల అయ్యే పాఠశాల నిధులను సద్వినియోగం చేసుకుని పాఠశాలకు పెయింటింగ్, ఇతర అభివృద్ధి పనులను చేసి మరింత సుందరంగా తీర్చిదిద్దండి అని ఏం ఈ ఓ సింహాచలం తెలిపారు. గింజర్తి లో ఉన్న పాఠశాలలోనే కొనసాగించేందుకు జిల్లా కలెక్టర్ మరియు డి ఈ ఓ, ఎం ఈ ఓ సింహాచలం లు తమ పిల్లల భవిష్యత్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్న వారందరికీ గ్రామస్తులు,విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేసారు.

## కొండగోకిరి లో ఎంపీడీవో పారిశుధ్య పనుల పరిశీలన...!




**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 7:**ప్రస్తుత కాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు పెరుగుతునందున విధిగా అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచి పరిసరాల పరిశు భ్రత పాటించాలని ఎంపీడీవో జీవిడి ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలన అధికారి బాల మురళీకృష్ణ అన్నారు. కొయ్యూరు మండలంలోని కొండగోకిరి సచివాలయం పరిధిలో గోకిరి లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శుక్రవారం వారు తనిఖీ చేసి పరిశీలించారు .వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. అన్ని వీధుల్లో తిరిగి కాలువల్లో పడికతీత మరియు రోడ్లు శుభ్రత చేయాలని, బోర్ బావుల వద్ద నీటి నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో ప్రసాద్ సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏ ఓ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం వేడుకలు



**జి.మాడుగుల.పెన్ పవర్.ఆగస్ట్(7)** ఈరోజు చేనేత దినోత్సవం సందర్భంగా శ్రీ శివుని సమేత మార్కండేయ స్వామికి పూలమాలలు వేసి ఘనంగా వేడుకలు చేశారు ఈ యొక్క కార్యక్రమంలో సంఘ పెద్దలు బొజ్జ అర్జున్ రావు బొజ్జ సత్యారావు బేతాళవరాజు బేతా అచ్యుత్ రావు కాపు చంద్రావు బొజ్జ శంకర్రావు సిరి శెట్టి గోవిందా తంగేటి సురేష్ మిడిసి పాటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

# దగా డీఎస్సీపై తాడేపల్లిగూడెం నియోజకవర్గం స్థాయి రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు..





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 07.**డీఎస్సీ--2025 నియామకాల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని, రాజకీయ బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పోలీస్ ఐ ల్యాండ్ వద్ద రెండవ రోజు రిలే నిరాహార దీక్ష ప్రారంభించిన తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ డీఎస్సీ ప్రక్రియలో పారదర్శకత లోపించి, వేలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడంపై సమాధానం చెప్పాలన్నారు.
అమలుకాని నిరుద్యోగ భృతి: ఎన్నికల ముందు ప్రతి నిరుద్యోగికి నెలకు ?3,000 ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు రూపాయి కూడా విదారించకుండా యువతను దారుణంగా మోసం చేశారు.
నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం డీఎస్సీ ద్వారా భర్తీ చేసిన 16 వేల ఉపాధ్యాయ పోస్టుల్లో పారదర్శకత పాటించకుండా, అర్హులైన అభ్యర్థులను పక్కనపెట్టి, అనర్హులకు, అధికార పార్టీ అనుచరులకు ఉద్యోగాలు కట్టబెట్టిందని ఆరోపించారు. స్పోర్ట్స్ కోటా పేరుతో అక్రమంగా వెయిటేజ్ మార్కులు జోడించి నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు నిర్వహించడం యువత భవిష్యత్తుతో చెలగాటమాడటమేమిటని మండిపడ్డారు.
ఈ డీఎస్సీ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రిలే నిరాహార దీక్షలు, నిరసన ర్యాలీలు, ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. టిడిపి పాలనలో జరిగిన అక్రమాలను ప్రజలకు వివరించే బాధ్యత యువతపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,యువత, విద్యార్థులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

# రైతు సేవ కేంద్రాల్లో ఎరువులు సిద్ధం



**మండల వ్యవసాయ అధికారి విశ్వనాథ్**

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 7:**ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ మండలంలో ఇంకా పూర్తిస్థాయిలో పంటల సాగు ప్రారంభం కాకపోయినా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు సేవా కేంద్రాల్లో అవసరమైన ఎరువులను సమృద్ధిగా నిల్వ ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి కె. విశ్వనాథ్ తెలిపారు.మోహనాపురం, జడేరు, కొత్తాడ, మొల్లేరు సహకార సంఘం, నెల్లిపూడి, జగ్గంపాలెం రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే కొత్తాడ, మొల్లేరు సహకార సంఘాల పరిధిలో డీఏపీ ఎరువు కూడా రైతులకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.రైతులు తమ ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో మండలంలోని సమీప రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించి నూతన విధానంలో ఎరువులు పొందవచ్చని సూచించారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 211 మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చి పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలో 90 మెట్రిక్ టన్నుల యూరియా, 10 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కె. విశ్వనాథ్ వెల్లడించారు.

# శిశువుకు 6నెలలు పూర్తి అయ్యే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 07.** ఐసిడిఎస్ ఆధ్వర్యం లో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ లోని యాగర్లపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ నందు తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.. శిశువు పుట్టిన 1గంట లోపు ముర్రుపాలు పట్టించడం వల్ల శిశువుకు వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, శిశువుకు 6నెలలు పూర్తి అయ్యే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని మరి ఏ ఇతర ద్రవపదార్థాలు పట్టకూడదని తెలియచేసారు. 6నెలలు పూర్తి అయిన తరువాత తల్లిపాలతో పాటుగా అనుబంధహారం మొదలు పెట్టాలని తెలియచేయడమైనది. అనుబంధహారం మొదలుపెట్టిన తరువాత ఇంట్లో వండిన ఆహారాన్ని మెత్తగా గుజ్జుగా చేసి బిడ్డకు అందించాలని, ఆహారం లో ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు,పాల పదార్థాలు అన్ని సమపాళ్లలో అందించాలి. 2సంవత్సరాల పిల్లలకు చక్కెర పెట్టకూడదని, చాక్లెట్స్ బిస్కెట్స్, కూల్ డ్రింక్స్ ఇవ్వకూడదని తల్లులకు అవగాహన కల్పించారు.. ఈ అవగాహన కార్యక్రమమునకు ఐసిడిఎస్ సూపర్వైజేర్ సీఎహ్. కె. దుర్గా భవాని, కె. విశాలాక్షి, మెడికల్ ఆఫీసర్స్ డా. సాయిలత, డా. జి. అనిషా వెసలీ, ఎస్సార్ కాలేజ్ నుండి హోమియో డాక్టర్స్ మహేష్, ఏ ఎం ఎస్ , అంగన్వాడీ కార్యకర్తలు మరియు తల్లులు పాల్గొన్నారు.

# శంకరమఠంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి శ్రీ సర్వ మంగళ అమ్మవారికి ఆషాఢమాసం సారె







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఆగస్టు 07.**స్థానిక తాడేపల్లిగూడెం శంకరమఠంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి శ్రీ సర్వ మంగళ అమ్మవారి యొక్క దేవస్థానం నందు ఆషాఢమాసం కృత్తిక నక్షత్రం సందర్భంగా శ్రీ సర్వమంగళా అమ్మవారికి విశేష కుంకుమార్చనలు జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు వివిధ రకాల పండ్లు, స్వీట్స్ , గాజులు, పసుపు కుంకుమ తో సారె సమర్పించారు. శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య స్వామి వారికి విశేష అర్చనలు జరిగాయి. శ్రీ ఉమాచంద్రమౌళీశ్వర స్వామివారికి అభిషేకాలు వేద పండితులచే నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో అనేకమంది భక్తులు పాల్గొన్ని అమ్మవారి దర్శనఅనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# కిమ్మూరు లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం..



**అడ్డతీగల, పెన్ పవర్, ఆగస్ట్07**:అడ్డతీగల మండలం గొంటు వాని పాలెం మరియు కిమ్మూరు గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ శివ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ,దీనివలన దాదాపు 30 నుంచి 35 శాతం లోటు వర్షపాతం
ఇప్పటి వరకు నమోదయిందని శివ శ్రీనివాస్ తెలిపారు. నీటి వసతి బాగా ఉన్న ప్రాంతాలలో మాత్రమే వరి పండించాలని, లేనియెడల ప్రత్యామ్నాయ పంటలైన చిరుధాన్యాలు మరియు అపరాలు సాగు చేపట్టాలని ఆయన సూచించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏ.పీ. సి.ఎన్.ఎఫ్ .డి .పి ఎం. రాబిన్ విత్తన బంతులను తయారు చేసుకునే విధానాన్ని చేసి రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో వి.ఏ.ఏ లు, వీ.ఆర్వోలు మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

# రైతు కూలీల ఉపాధి ని దెబ్బతీస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

* 9 వ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా మహాసభల్లో వక్తలు






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఆగస్టు 7**ం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కూడా కష్టజీవులు, రైతు కూలీలకు వ్యతిరేకంగా చట్టాల మారుస్తూ వారిని దెబ్బతీస్తున్నాయని పలువురు వక్తలు విమర్శించారు.స్తానిక పట్టణ రజక సంఘం ఫంక్షన్ హాల్లో శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం తొమ్మిదో జిల్లా మహాసభ జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులు జే సత్తిబాబు సంఘం జెండా ఎగరవేశారు. సంఘం నాయకులు జె సత్తిబాబు పి బుజ్జి రెడ్డి పండేల సోమన్న గంటా బాలరాజు అధ్యక్షతన మహాసభ నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి పి వెంకట్ నాయుడు ఉద్యమాల్లో అమరులైన అమరులకు సంతాప తీర్మాన్ని ప్రవేశపెట్టగా సంతాపాన్ని పాటించింది. ఈ సభకు ముఖ్య వక్తలు గా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏం దుర్గాప్రసాద్ సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె వెంకటేశ్వర్లు రాష్ట్ర పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ నాయకులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భభంగా వారు మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్లకు, సామ్రాజ్య వాదులకు, బహుళ జాతి సంస్థలకు దేశసంపదను, కార్మిక, రైతు కూలి శ్రమ శక్తిని దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న ప్రజాస్వామ్యవాదులను, ప్రజా ఉద్యమాలను తీవ్రంగా అణచివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకుల ప్రజా వ్యతిరేక చర్యలకు దేశంలో ప్రజలంతా తిరుగుబాటు చేయవలసిన అవసరం ఉందని ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో గత ఏడు సంవత్సరాలుగా జరిగిన ఉద్యమాల కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకున్నారు దేశంలో జరుగుతున్న ఉద్యమాలను బలపరుస్తూ రైతు కూలీలు బలమైన ఉద్యమాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం సీనియర్ నాయకులు కత్తిల స్వామి రెడ్డి, సాధన విజయభాస్కర్ రెడ్డి, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం ఏసు, రాష్ట్ర నాయకులు ఏ వి రమణ, పిడిఎస్ జిల్లా కార్యదర్శి రేవు తిరుపతిరావు, పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి జే సత్యవేణి, రైతు కూలీ సంఘం నాయకులు పెండేలా పాపన్న, పాలెపు రామారావు దొర, సాకిరి భాస్కర్ 200 మంది అఖిలభారత రైతు కూలీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతన్నా మీ కోసంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల




**రాజమహేంద్ర వరం, పెన్ పవర్, ఆగస్టు 7:** ఖరీఫ్ 2026 సీజన్‌లో ఎల్-నీనో పరిస్థితుల నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా "రైతన్న మీకోసం -- ఎల్-నీనో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక" అనే పేరుతో సమగ్రమైన క్షేత్ర అవగాహనను రైతులు పెంచుకోవాలని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు.
సమగ్ర రైతు, పొలం స్థాయిలో పంట పరిస్థితులు, తేమ ఒత్తిడి స్థాయిలు, ఎండిపోవడం,వాడిపోవడం, చీడ-పీడల ఉధృతి, స్థితి, తోటలు, బీడు బంజరు భూములను అంచనా వేయడం, తక్షణ ఉపశమన చర్యలు, కరువు నివారణ , ప్రాణాధార అనుబంధ నీటిపారుదల, విత్తన పెల్లెటింగ్ ప్రత్యామ్నాయ పంటల నిర్వహణను అమలు చేయడం జరుగుతుందన్నారు.ఇది పారదర్శ కమైన ట్రాకింగ్ కోసం ఏపీ ఏ ఐ ఎం ఎస్ 2.0 ప్లాట్‌ఫారమ్‌ను ఉపయో గించి పటిష్టమైన డిజిటల్ పర్యవేక్షణ యంత్రాంగాలను ఏర్పాటు చేస్తుందని అధికారిక ఫార్మర్ యాప్ ద్వారా రైతు సంఘాలతో ప్రత్యక్ష సంభాషణను ప్రోత్సహిస్తుందన్నారు. కడియం మండలంలో 5500 ఎకరాలలో వరి సాగు చేస్తున్నారని ఇక్కడ ఎల్-నీనో ఎఫెక్ట్ లేదని, సరిపడా సాగు నీరు ఉందని వాతావరణ పరిస్థితులు దృష్ట్యా వరి పంటకు పంటల భీమా తప్పనిసరిగా చేయించుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల సూచించారు. పురుగు మందుల వాడకం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయం లో భాగంగా కషాయాలు వాడాలని, వ్యవసాయంలో డ్రోన్ లో వినియోగం ఉపయోగించాలని రైతులకు చూసించారు.
ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మండల తెదేపా అధ్యక్షులు వెలుగుబంటి రఘురాం, గుర్రపు సత్యనారాయణ, సురపరెడ్డి భరత్ కుమార్, ముమ్మిడి నాగేశ్వరరావు, తూము శ్రీను, ప్రత్తిపాటి రామారావు చౌదరి, కంటిపూడి శ్రీను, గ్రంధి వెంకయ్య, ఏడిఏ శశి బిందు, ఎంఏఓ పి.వి.శ్రీనివాస్, వి ఏ పద్మజ, గోపి, కోటేశ్వరావు రైతులు పాల్గొన్నారు.

# ఈనెల 9న రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం

**గుండె, నేత్ర పరీక్షలు.. అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలు**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, ఆగస్టు 7:**రామకృష్ణ మిషన్, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో రంపచోడవరం మండలం సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఆగస్టు 9 (ఆదివారం) ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద మహారాజ్ తెలిపారు.
ఈ శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు ఆయాసం, గుండెదడ, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రక్తపోటు, మధుమేహ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు.
వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్రాలయం వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడులు అందజేయనుంది. శుక్లాల (క్యాటరాక్ట్) శస్త్రచికిత్స అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు.వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ఈ ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్వామి పరిజ్ఞేయానంద మహారాజ్ కోరారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com